# 9వ పుష్పము

9. ఓం శ్రీ సాయి సర్వజ్ఞాయ నమః

1) నామ పారాయణ ప్రియుడు :

సర్వజ్ఞుడు = (1) జ్ఞానముత్తమ మిత్యేతత్ సవిశేషణ మేకం నామ = సమస్తమైనవాడు, (2) "జ్ఞానంప్రకృష్ణ మజన్యం అనవచ్ఛిన్నం సర్వస్య సాధకతమితి జ్ఞానముత్తమం బ్రహ్మ", "సత్యం జ్ఞానమనన్తం బ్రహ్మ" (తై.ఉ. 2-1) ఇతిశ్రుతేః =జ్ఞాని కనుక సర్వజ్ఞుడు. (3) జ్ఞాన ముత్తమమ్ = ఎవని నుండి పుట్టినదియు, తరగనిదియు, అన్నిటికి ముఖ్య సాధకమైనదియునగు నుత్తమజ్ఞానము కలుగునో అతడు జ్ఞానముత్తముడు. అతడే బ్రహ్మము, సాయి పరమేశ్వరుడు. (4) జ్ఞానగమ్యుడు "న కర్మణా నజ్ఞాన కర్మభ్యాం వాగమ్యతే, కిన్తుజ్ఞానేన గమ్యత ఇతి జ్ఞానగమ్యః" = కర్మచే గాని జ్ఞానకర్మలచే గాని కాక, జ్ఞానము చేతనే పొందదగినవాడు. (5) "సర్వజానాతీతి సర్వజ్ఞః" "యః సర్వజ్ఞః సర్వవిత్" ఇతిశ్రుతేః = అన్నిటిని ఎరిగినవాడు సర్వజ్ఞుడు. ప్రతివారియొక్క భూత భవిష్యద్వర్తమాన ములు నాకు తెలుసు అన్నారు స్వామి. "యేనేదగ్ సర్వవిజానాతి తం కేన విజానీయాత్" (బృ.ఉ.) = సర్వం తెలుసుకొనే దానిని దేనిచేత మనం తెలుసుకుంటాము. అందుచే స్వామి చెప్పినది మనం చేయటమే మన విధి, కర్తవ్యం, అట్టి స్వామికి నమస్కరించుచున్నాను.

2) కవీశ్వరుడు

ఎన్ని విద్యలైన ఏషారచదివినా పొట్టకూటికేగాని, గిట్టబోవు,
మట్టిబొమ్మలోని మర్మంబునెరుగని చదువులెల్ల పరము చేర్చగలవా?

ప్రహ్లాదుడు తండ్రికి "చదువులలో మర్మమెల్ల చదివితి తండ్రీ" అని చెప్పాడు. మర్మమనగా రహస్యమైన గుట్టు. బహ్మవిద్యను రహస్యములలో రహస్యమైనదన్నారు. పరమైన విద్యయే పరమును చేరుస్తుంది. ఇప్పటి చదువులు అట్టి పనులు చేయలేవు. అట్టి పరవిద్య లేక బ్రహ్మవిద్య అనగా నెట్టిది? ముండకోపనిషత్తు చూడండి. "ద్వేవిద్యే వేది తవ్యే" బ్రహ్మవేత్తలు పరయనియు, అపరయనియు రెండు విద్యలని పలుకుచున్నారు. (1) పరవిద్య పరమును చేరుస్తుంది. అదియే బ్రహ్మవిద్య (2) అపరవిద్య అనగా ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదము, అధర్వణ వేదము, దాని షడంగములు, అవి శిక్షా, వ్యాకరణ, కల్పము, నిరుక్త, ఛందస్సు, జ్యోతిషము.

3) సకలతత్త్వ బోధకుడు - ప్రసాదంగా భావిస్తే - దోషపరిహారము

"పాత్రశుద్ధి, పదార్థముల శుద్ధి, పాక శుద్ధి ఇవి లేకుండా ఆహారాన్ని భుజించ రాదు. మనము వంట చేసు కొనే పాత్ర పరిశుద్ధంగా వుండాలి. రెండవది పదార్ధశుద్ధి. అనగా పదార్థము న్యాయముగా ఆర్జించినదా? అన్యాయముగా తెచ్చుకున్నదా? లేక దొంగిలించి తెచ్చుకున్న ఆహారమా? పరులను బాధించకుండా తెచ్చినదా? పరుల హృదయానందము తెచ్చినదా? ఏవిధమైన పదార్థమని చక్కగ యోచించాలి. అన్యాయార్జిత పదార్థము అనారోగ్యము కలిగించడమే కాకుండా దుర్బుద్ధులను పెంచుతుంది. ఇంక పాకశుద్ధి చేసేవారి హృదయము ఎట్టి తలంపులతో నిండియున్నది, యే హృదయముతో, ఎట్టి భావములతో పాకం చేస్తున్నారు అని ఆలోచించాలి. ఈ మూడింటిలో పాత్రశుద్ధి మనము చేయవలసియుంటుంది. కాని పదార్ధశుద్ధి, పాకశుద్ధి మన చేతులలో లేవు. అంగడినుంచి తెచ్చుకున్న పదార్థములు, బజారు నుంచి తెచ్చుకున్న కూరగాయలు, దొంగిలించినవో, తోటనుంచి తెచ్చుకున్నవో, ఎవరినైన మోసము చేసి తెచ్చినవో మనక తెలియదు. కనుక పాకము చేసిన తర్వాత, భుజించుట కు పూర్వము

బ్రహ్మార్పణం బ్రహ్మహవిః బ్రహ్మాగ్నౌ బ్రహ్మణాహుతం ।

బ్రహ్మైవతేన గం తవ్యం బ్రహ్మకర్మ సమాధినా ॥

అని పరమాత్మకు అర్పణం గావించి, భుజించడంలో ఈ మూడు విధములైన శుద్ధి అందులో చేరుతుంది. ఆహార శుద్ధి నిమిత్తమే ఈ ప్రార్థనను అందిచ్చారు గాని, భుజించుటకు ప్రార్థన చెయ్యాలన్నది నిర్బంధము గాని, శాసన

ము గాని లేదు. ప్రార్థనకు ముందు అది ఆహారము; ప్రార్థన చేసిన తరువాత అది ప్రసాదము, ప్రసాదమునకు ఎట్టి దోషములు ఉండవు. పాత్ర దోషము, పదార్థ దోషము, పాక దోషము ఈ మూడింటిని అది పరిహారము చేస్తుంది.

4) సర్వజ్ఞుడు - అధర్వణీయ శరభోపనిషత్తు

మం॥ బ్రహ్మార్పణం బ్రహ్మహవి బ్రహ్మాగ్నౌ బ్రహ్మణాహుతం
బ్రహ్మైవతేన గంతవ్యం బ్రహ్మకర్మ సమాధినా ॥

ఇదే మంత్రం భగవద్గీతలో చెప్పబడియున్నది. (భ.గీ. 4-24)

తా॥ బ్రహ్మవేత్త అయినవాడు యజ్ఞములో నెయ్యి మొదలగు హవిస్సులను, అగ్నిలో హుతము చేయుటకు సాధనముగా దేనిని యుపయోగించునో దానిని బ్రహ్మమే యని చూచుచున్నాడు (తలంచుచున్నాడు). అతనికి ఆ హవిస్సు బ్రహ్మము, అగ్నియు బ్రహ్మమే, యజ్ఞకర్త బ్రహ్మయే. చేయబడు హోమము బ్రహ్మమే. ఆ బ్రహ్మమే యీ యజ్ఞకర్మలో నిలకడ గల మనస్సు గల వాడైన అతనిచే పొందబడునదియు బ్రహ్మమే. మరి యేకారణమున జ్ఞాని చేయు కర్మ తన ఫలమును కలుగజేయక పూర్తిగా తొలగిపోవుచున్నది? అది యీ శ్లోకమున చెప్పబడినది. (శ్రీ శంకరులు) బ్రహ్మము వాడు. ఏ సాధనము చేత హవిస్సును అగ్నిలోనుంచు చున్నాడో అది బ్రహ్మమేయని చూచుచున్నాడు. సీసములో వెండి లేకపోవుటకు (సీసమే గాని వెండి లేదని) చూచుటవలె. ఆత్మకంటె వేరైనది లేదని చూచుచున్నాడు. కావున హవిస్సు నర్పించు సాధనము బ్రహ్మమే యనబడుచున్నది. అన్నియు బ్రహ్మమే యని ఎరుంగునతనికి కర్మలేదు. కారకమును గూర్చిన తలంపే లేనందున అతనికి కర్మయే లేదు.

5) ప్రేమ స్వరూపుడు

"ప్రేమలేని ధర్మము విచారించదగినది కాదు. ప్రేమతో కూడిన ధర్మమే విచారించ తగినది. ప్రేమతో కూడిన ధర్మమే దైవత్వము. ప్రేమయే సర్వభూతముల సారము. సర్వభూతముల యందు నిరూపించే ప్రేమతత్త్వమే దైవా రాధన. అన్ని సమయములందును ఉత్తమమైన రసము కరుణరసము. సర్వధర్మముల యందును మానవుని కర్త వ్యము చిత్తశుద్ధి. సమస్త సాధనముల యొక్క గమ్యము శాంతి సాధనము."

దివ్యలీల : అట్టి ప్రేమస్వరూపుడు హెరాల్డుసన్ అను శాస్త్రజ్ఞుని యొక్క ఉంగరములోని రాయిని అదృశ్యము చేయించారు. అతను కాలిఫోర్నియా నుంచి వచ్చాడు. భగవానుని దర్శనం కోసం వచ్చాడు. ఆయన దేశమంతా తిరిగి భక్తులను కలుసుకొని అనేక మహత్యాలు విన్నాడు. వాటిని ధృవపరచుకొన్నాడు. ఆయన అన్నాడు "నా 25 సంవత్సరములఅనుభవంలో ప్రపంచమంతా తిరిగాను. కాని ఇటువంటి దివ్య మహత్యాలు చూడలేదు. అవి మన తెలివితేటలకు అందవు" అని తన రిపోర్టులో వ్రాసాడు. ఇంకొకరు అన్నారు "ప్రేమ రెండు కాళ్లతో ఎక్కడన్నా నడుస్తుందా అంటే. అది ప్రశాంతి నిలయంలోనే".

దివ్యచికిత్స : అటువంటి ప్రేమస్వరూపుడు శ్రీమతి ముఖర్జీ రొమ్ము కేన్సరుకు దివ్యచికిత్స చేసి నయము చేశారు. డాక్టర్లు పరీక్షచేసి 8 మాసముల ఆయుర్దాయమిచ్చాడు. సంవత్సరములు గడిచినాయి. అయినప్పటికీ ఆరోగ్యంగా యున్నది, అది సాయికృప.

6) సకల జనప్రియుడు : (శ్రీ దీపాల పిచ్చయ్య శాస్త్రి) తన అనుభూతిని యిట్లా వెల్లడించారు.

భవుడనీవే, కమల భవుడవే, శ్రీ షిర్డీ
సాయి నీవే, శేషశాయి నీవే,
కేవలుడవె? సర్వదేవతామూర్తివి
సత్యసాయి దేవ శరణు శరణు ॥

భగవద్భక్తియు, పరమార్థ చింతయు, ఐహిక తుచ్ఛ సుఖ వ్యామోహితమై అజ్ఞానాంధ కారమునబడి అధోగతి పాలగుచున్న ప్రపంచమునకు జ్ఞాన జ్యోతిని ప్రసాదించి సనాతన ధర్మమును భారతీయ సంస్కృతిని పునరుద్ధరిం చుటకై అవతరించిన భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారు ఆసేతు శీతలాచల పర్యంతరము పర్యటించి ప్రసన్న

ప్రజానీకమునకు గావించిన దివ్యబోధలే శ్రీ సత్యసాయి వచనామృత గ్రంథము. ఇది ఒక ఆరాధన భవతారకము, స్వామివారి యుపన్యాసములే యొక దివిజ గంగాప్రవాహం. ఆ ప్రవాహము సరస, సరళ, మధుర సంపదతో వుంటుంది. తేటతెలుగు తీరు తియ్యందనముతో వుంటుంది. అద్భుతములైన ఉపమానాది అలంకారముల శోభిత మై పదపదమునను వేదశాస్త్ర పురాణార్ధ ప్రతిపాదికమునై, సనాతన ధర్మ ప్రతిపాదికమునై, పండిత పామర హృదయ రంజితముగా సాగిపోతూ వుంటుంది. సందర్భానికి అనుకూలములైన అపూర్వ కథలతో నిండి యుంటుంది."

7) స్తుతిప్రియుడు

"సర్వరూప ధరం శాంతం సర్వనామ ధరం శివం
సచ్ఛితానంద మద్వైతం సత్యం శివం సుందరం"

అని సెలవిచ్చారు స్వామి. ఇంకా యిట్లా అన్నారు. "సంకీర్తన మనగా భగవంతుని లెస్సగా కీర్తించడం. భగవంతుని కీర్తిని ప్రకటించడం, కీర్తన సాధకుని పవిత్రం గావిస్తుంది. విష్ణుకీర్తన, విశ్వాన్నే తరింపచేస్తుంది. కీర్తన వ్యక్తిగత మైన భగవత్ప్రార్థన. సంకీర్తన విశ్వశ్రేయస్సును కోరి చేసే సమిష్టి ప్రార్థన. కీర్తన నాలుగు విధములు, మొదటిది గుణ సంకీర్తన, రెండవదిలీలా సంకీర్తన, మూడవది భావ సంకీర్తన, నాల్గవది నామ సంకీర్తన.

దివ్యభజన : గోపాలా గోవిందా నారాయణ హరి
నందలాలా ముకుందా నారాయణ హరి ॥గో॥
నారాయణ హరి నారాయణ హరి
వేదపారాయణ హరి సాయినారాయణ హరి ॥గో॥

వేదుడు = వేదయతీతివేదః = జ్ఞానము నొసంగువాడు

గోవిందుడు = (1) గోవులకు యింద్రునివంటివాడు, (2) రాక్షసులచే ఎత్తుకొని పోబడిన భూదేవిని పైకెత్తిన వాడు, (3) గోవనగా సరస్వతి. దానిని ఎరిగినవాడు కావున గోవిందుడు (హరివంశం)

నారాయణుడు = (1) నారములైన ఆకాశాది భూతములే నివాసస్థానముగా గల వాడు, (2) నారులనగా జీవులు - ప్రళయకాలమందు అయనమైనవాడు, (3) నారములనగా ఉదకములు - అవే నివాసస్థానముగా గలవాడు. గోపాలుడు = గోవులను పాలించువాడు. ముకుందుడు = మోక్షము యిచ్చువాడు.

8) వేదాంతవేద్యుడు - స్వామి వజ్రసంకల్పుడు

నా కార్యక్రమములో మార్పులు చెయ్యడానికి ఎవ్వరితరము కాదు అన్నారు కఠోపనిషత్తులో.

మం॥ యదిదంకించ జగత్సర్వం ప్రాణ ఏజతి నిసృతమ్
మహోద్భయా వజ్రముద్యంతం యయేతద్వి దురామృతాస్తే ॥(2-3-2)

తా॥ పరబ్రహ్మము ఉండునప్పుడు యీ ప్రపంచమందలి సమస్త వస్తువులు, చలించుచున్నవి. వానివాని వ్యాపారములు సమముగా జరుగుచున్నవి. అందుండి సర్వము బయలుపడినది. అది గొప్ప భయంకరమైనది. వజ్రాయుధమును చేతదాల్చినది, ఎవరు దీనిని తెలుసుకొనుచున్నారో వారు మరణములేని వారయ్యెదరు.

మం॥ భయాదస్యాగ్ని స్తపతి భయాత్తపతి సూర్యః
భయాదింద్రశ్చ వాయుశ్చ మృత్యుర్థావతి పఞ్చమః ॥ (2-3-3)

తా॥ అందుండి కలిగిన భయము చేతనే అగ్ని కాలుచున్నది. సూర్యుడు కాల్చుచున్నాడు. ఇంద్రుడును, వాయు వును, అయిదవదగు మృత్యువును పరుగిడుచున్నారు. అనగా వారి వారి కార్యములను ప్రయత్నముతో చేయు చున్నారు.

**ఓం తత్సత్**